క్లుప్తంగా

గురుకుల ప్రవేశ పరీక్ష పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ , ప్రిన్సిపాల్

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె బాలికల గురుకుల పాఠశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి 5,6,7,8వ తరగతుల్లో మిగిలిన సీట్ల ప్రవేశానికి ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని బుధవారం ఎంఈఓ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ శోభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెలాఖరులోపు దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 25న జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఏఎన్ఎం మృతికి వైద్యుల నివాళి

గంగవరం: మండలంలోని కీలపట్ల సచివాలయంలో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్త (ఏఎన్ఎం)నీలవేణి కొంతకాలంగా ఊపిరితిత్తులు, కాలేయం వ్యాధితో బాధపడుతున్నారు. రెండు రోజులుగా వేలూరు నర్వి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఇది తెలుసుకున్న గంగవరం వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరి, ఆరోగ్య సిబ్బంది కీలపట్లకు వెళ్లి నీలవేణి మృత దేహానికి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అదుపు తప్పి మోటార్ సైక్లిస్టుకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మణి

పుంగనూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని ఏతూరుకు చెందిన మణి (24) తన పనుల నిమిత్తం బట్టందొడ్డికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి పడ్డాడు. ఈ ప్రమాదంలో మణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారి విహారం


సూర్యప్రభ వాహనంపై భక్తులను కటాక్షిస్తున్న స్వామివారు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి మొక్కులు చెల్లించారు.

14న డయల్ యువర్ డీఎం

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో ఈనెల 14వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించున్నామని డీఎం సుధాకరయ్య బుధవారం తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సమస్యలను సెల్ నంబర్ 9100 941850 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

యువతను ముంచిన ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

బైరెడ్డిపల్లె: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతను నిలువునా ముంచిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. బైరెడ్డిపల్లెలో బుధవారం వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం కోసం అడ్డగోలు హామీలు తమను వంచించిందని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ఉపాధి అవకాశాలు లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని, ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంటు, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని మాయమాటలతో ముందుకు వచ్చి ఎగనామం పెట్టారన్నారు. 2014లో కూడా ఇలాగే హామీలతో ప్రజలను బురిడీ కొట్టించారన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక వైపు పరిశ్రమలు, మరో వైపు నిరుద్యోగులకు ఉపాధి, ఇంకో వైపు చదువుకు విద్యా దీవెన ఎప్పటికప్పుడూ త్రైమాసికంలోనే అందిస్తూ అన్ని విధాలా జగనన్న ఆదుకున్నారని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా వేటినీ అమలు చేయక చివరకు ప్రజల్లో వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యులు ఆర్.కేశవులు, నితిన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచులు వెంకటేష్, బాలక్రిష్ణగౌడు, రమణారెడ్డి, దేవేంద్రరెడ్డి, రాజప్ప, చంద్రమౌళి, రవిచంద్ర, ఎంపీటీసీలు నాగరాజు, వినాయకం, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లె: ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

మహానేత ఆశయాలను నెరవేర్చడమే లక్ష్యం

చౌడేపల్లె: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేర్చడమే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యులు ఎన్. దామోదరరాజు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక బస్టాండ్‌లో తొలుత వైఎస్ఆర్‌కు ఘన నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలతో నిలదీస్తామన్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్టారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, ఎంపీటీసీ శ్రీరాములు, డీసీసీబీ మాజీ డైరక్టర్ రమేష్‌బాబు, కో–ఆప్షన్ మెంబర్ సాధిక్, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: కుప్పంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మున్సిపల్ అధ్యక్షులు హఫీజ్ స్థానిక ఆర్టీసీ బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేస్తోందని, హామీలు నెరవేర్చక ప్రజల నుంచి వ్యతిరేకతను చవిచూస్తోందన్నారు. పార్టీ నాయకులు మోహన్ రామ్, గణేష్, నాగరాజు, భాగ్యరాజ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నాయకులు దేవేంద్రప్ప, పెద్దన్న, కృష్ణమూర్తి, జగదీష్, చలం, ఆర్ముగం, నిసార్, అశ్వత్, మురళీరెడ్డి, గజ్జల రమేష్, చలపతి, మురుగేష్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా కూటమి దగా

పలమనేరు: వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ జెండా ఆవిష్కరించి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిందని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ఇప్పుడు కూటమి హామీలు నెరవేర్చక తమను నిలువుగా దగా చేసిందని ప్రజలు మండిపడుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. మండల కన్వీనర్లు బాలాజీనాయుడు, బాగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మురళి, చెంగారెడ్డి, ప్రహ్లాద, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


కుప్పం: వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సదుం: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, చౌడేపల్లె: వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు తదితరులు

వేలంలో రూ 26.60 లక్షల ఆదాయం

శాంతిపురం: బడుగుమాకుపల్లె వారపు సంతలో గేటు వసూలు హక్కుల కోసం బుధవారం నిర్వహించిన వేలంలో పంచాయతీకి రూ 26.60 లక్షల ఆదాయం లభించింది. కెనమాకులపల్లెలోని గ్రామ సచివాలయంలో కుప్పం డీఎల్‌పీఓ ఎస్.రాధాకృష్ణ, ఈవోపీఆర్డీ రవినాయక్ సమక్షంలో వేలం నిర్వహించారు. వారపు సంత అంగళ్ల గేటు ద్వారా రూ 4.80 లక్షలు, కోళ్లు, గొర్రెల గేటుతో రూ 5.35 లక్షలు, ప్రైవేటు వాహనాల గేటు ద్వారా రూ 5.30 లక్షలు, ఎద్దులు, పశువుల గేటు వసూలు హక్కులకు రూ 11.15 లక్షల ఆదాయం లభించింది. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏవీ జయరాం, పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనారాయణ, వైస్ సర్పంచ్ అప్పిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఉత్తమ భవిష్యత్తే లక్ష్యం

వి.కోట: విద్యార్థి దశలో పదోతరగతి కీలకమైనదని, అందరూ ఉత్తమ భవిష్యత్తే లక్ష్యంగా మంచి ఫలితాలను సాధించాలని నలంద విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక పలు పాఠశాలలు, రామకుప్పం మండలంలోని పలు పాఠశాల విద్యార్థులకు ఆయన తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో డాక్యుమెంట్ ఫైళ్లతోపాటు ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి ఆయన మాట్లాడారు. వివిధ స్కూళ్ల హెచ్ఎంలు, టీచర్లు, అధ్యాపకులు వినయ్ రెడ్డి, హరిప్రసాద్, సుబ్రమణ్యం, గణేష్, శివకుమార్, గురు ప్రసాద్, హరికష్ణ, ప్రకాష్, తుకారాం మమత, నందిని తదితరులు పాల్గొన్నారు.


డాక్యుమెంట్ ఫైళ్లు అందుకున్న విద్యార్థులతో నలంద విద్యాసంస్థల అధ్యాపకులు

పరీక్ష సామగ్రి వితరణ

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సుజన్‌రాజు వితరణతో అతని మిత్ర బృందం పరీక్ష సామగ్రిను అందజేసింది. బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో టెన్త్ విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని దాత ప్రకటించారని హెచ్ఎం నాగరాజ రెడ్డి తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్ సుధాకర్, పూర్వ విద్యార్థులు రోహిత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష సామగ్రి అందజేస్తున్న హెచ్ఎం, దాత మిత్ర బృందం

యువత పోరుకు తరలిన నేతలు


పుంగనూరు నుంచి యువతపోరుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు


సదుం నుంచి వెళ్లిన నాయకులు

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు చిత్తూరులో యువతపోరుకు బుధవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి , పార్టీ మండల నాయకుడు రమణ ఆధ్వర్యంలో వందలాది మంది వెళ్లారు. పార్టీ జెండాలు పట్టుకుని వైఎస్సార్‌సీపీ జిందాబాద్ .....జగనన్న జిందాబాద్...పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, చందు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె నుంచి..

చౌడేపల్లె: చిత్తూరులో యువత పోరుకు స్థానిక బస్టాండు నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు ఉన్నారు.

సదుం నుంచి..

సదుం: జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ధనుంజయరెడ్డి చిత్తూరులో యువత పోరుకు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, నాయకులు మనోహర్ రెడ్డి, పుత్రాజు, వాసు తదితరులు వెళ్లారు.

రొంపిచెర్ల నుంచి..

రొంపిచెర్ల: చిత్తూరులో నిర్వహించిన యువత పోరుకు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా, జిల్లా కార్యదర్శి కోటా వెంకటరమణ, వైస్ ఎంపీపీ విజయశేఖర్, మండల కన్వీనర్ చెంచురెడ్డి, ఎంపీటీసీలు రమణమ్మ, సీరాజున్నీసా, సర్పంచులు హేమలత, నాగిరెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, నాయకులు యుగంధర్ రెడ్డి, బాబు, కరీముల్లా,అమరనాథరెడ్డి, రాజేంద్రరెడ్డి, వెంకటరత్నం, రవీంద్ర, సురేంద్రనాయుడు, రమణయ్య, గురుస్వామి నాయుడు తదితరులు వెళ్లారు.


చిత్తూరుకు వెళ్లిన రొంపిచెర్ల వైఎస్సార్‌సీపీ నాయకులు

పది పరీక్షలకు సర్వం సిద్ధం

రొంపిచెర్ల: మండలంలో పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలకు రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. మండలంలోని రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో 61 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 54 మంది, మోడల్ స్కూల్‌లో 49 మంది, కేజీబీవీలో 40 మంది, ఉర్దూ ఉన్నత పాఠశాలలో 10 మంది, పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో 15 మంది, గానుగచింత ఉన్నత పాఠశాలలో 21 మంది, బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలకు సంబంధించి 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు.

కల్యాణ వైభోగమే..!

బైరెడ్డిపల్లె: మండలంలో కడపనత్తం సమీపంలోని శ్రీ నల్లగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన కల్యాణ మండపంపై అలివేలుమంగమ్మ పద్మావతి సమేత నల్లగుండ్రాయ స్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు, భక్తజన సందడి నడుమ వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు రామక్రిష్ణమాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. మొగిలప్పశెట్టి, ఈశ్వరశెట్టి, సుబ్రమణ్యంశెట్టి, వాసుదేవ శెట్టి, రవీంద్రశెట్టి, మునినారాయణశెట్టి ఉభయదారులుగా వ్యవహరించారు.

నివాళి


నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: మండలంలోని చెత్త పెంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త షణ్ముగం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది తెలుసుకున్న జెడ్పీ చెర్మన్ శ్రీనివాసులు బుధవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థులు చదువుల్లో బాగా రాణించి స్కూలు, గ్రామానికి పేరు తేవాలని విశ్రాంత తెలుగు ఆచార్యులు, రచయిత డాక్టర్ రాసాని వెంకట రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాసాని మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని, ఈ దశలో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. చదువును మించి ఆస్తి మరొకటి లేదని, మంచి పుస్తకాలు చదవడం ప్రతి ఒక్కరూ ఒక వ్యాపకం చేసుకోవాలని హెచ్ఎం శ్రీవాణి కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సదుం: టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం జయకుమార్ రెడ్డి, ఎంఈఓ–1 సిద్ధరామయ్య కోరారు. బుధవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొలుత సరస్వతీదేవికి పూజలు చేశారు. దాతలు రమామహేశ్వర్ రెడ్డి, హిందీ టీచర్ మృదులాదేవి పరీక్షల ప్యాడ్లు, పెన్నులు, జామెట్రీ బాక్సులను విద్యార్థులకు అందజేశారు.ఎంఈఓ–2 దామోదర, రిటైర్డ్ హెచ్ఎం కృష్టారెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం జెడ్పీ హైస్కూలు వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఓం ఆకారంలో వేసిన ముగ్గు వద్ద 10వ తరగతి విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించారు. వార్షికోత్సవ క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం రత్నమ్మ, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురవ్వొద్దు

పుంగనూరు: మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో బుధవారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. గూడూరుపల్లెలో హెచ్ఎం మహేష్‌నారాయణ, బండ్లపల్లె హెచ్ఎం శివశంకర్, ఈడిగపల్లెలో హెచ్ఎం రెడ్డెమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు చేశారు. ఎలాంటి ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాసి విజయం సాధించాలని హెచ్ఎంలు ఆకాంక్షించారు.

టీచర్లు, తల్లిదండ్రులకు మంచిపేరు తెండి

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హెచ్ఎం హేమావతి మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. టీచర్లు అఫీజుల్లా, రెడ్డెప్పనాయుడు, రమేష్, వెంకటనారాయణ, సుధాకర్, కళ్యాణి, స్వర్ణలత, ప్రకాష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

కత్రిపల్లెలో..

వి.కోట: కత్రిపల్లెలో హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హెచ్ఎం జగన్నాధం మాట్లాడారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలైన 144 మంది విద్యార్థులకు ఎండీహెచ్ సంస్థ అధినేత పవన్‌కళ్యాణ్ సౌజన్యంతో బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ హెచ్ఎం సురేంద్రరావు, కమిటీ చైర్మన్ జయచంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కల్లూరు హైస్కూల్లో మాట్లాడుతున్న రచయిత రాసాని



సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు, వి.కోట: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న పవన్ కళ్యాణ్


సదుం: ఓంకారం ఆకృతి చుట్టూ కొవ్వొత్తులు వెలిగిస్తున్న విద్యార్థినులు


పుంగనూరు: బండ్లపల్లె జెడ్పీ హైస్కూల్లో..